# తొలగిన తెరలు

## షాహీన్ ఖాన్



“కింగ్...కింగ్...” అన్న టెలి ఫోన్ శబ్దానికి వసుంధరాదేవికి మెలకువ వచ్చింది. బెడ్‌పైనుండే రిసీవర్ అందుకుంది.

“హలో! వసుంధరాదేవి హియర్!” అంది.

“ఏమ్మా? వసుంధరా! ఊర్నుండి ఎప్పుడొచ్చావ్? డ్యూటీలో ఎప్పుడు జాయినవుతున్నావ్?” అట్నుండి పలికిందో కంఠం.

“ఓ! మీరా! గుడ్ మార్నింగ్ సార్! నిన్న రాత్రి పన్నెండింటికి ఊర్నుండి వచ్చానండి! ఈ రోజే డ్యూటీలో జాయినవుతున్నాను.” సవినయంగా అంది యస్.ఐ. వసుంధర, సి.ఐ. నాగభూషణంగారితో.

“ఈరోజే జాయినవుతావా?” నవ్వుతూ అడిగారాయన.

“అవును సార్! మీకు తెలుసు కదా! నాకు డ్యూటీ ఈజ్ ఫస్ట్ అని!”

“ఎస్! ఎస్! ఐ నో యిట్! నా ఫ్రెండ్, అదే మీ నాన్న ఎలా వున్నాడు? మీ అమ్మా వాళ్ళు అంతా బాగున్నారా? మీ చెల్లాయి పెళ్ళి ఎలా జరిగింది? బాగా జరిగిందా?”

“బాగా జరిగింది సార్! మీరు రానందుకు చాలా బాధపడ్డాం సార్! నాన్నగారు మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు సార్!”

“నీకు తెలుసు కదమ్మా! నాక్కూడా డ్యూటీ యీజ్ ఫస్ట్ అని!”

“మీరు పంపిన గిఫ్ట్ అందరికీ నచ్చింది సార్! చాలా థాంక్స్!”

“ఓకె! ఓకె! మరి నే వుంటాను” అని రిసీవర్ క్రెడిల్ చేసారు.

వసుంధరాదేవి రిసీవర్ క్రెడిల్ చేస్తుంటే టక్ టక్ మంటూ తలుపు చప్పుడు వినిపించింది.

"కమిన్" అంటూ యిటు తిరిగిన వసుంధరాదేవి షాక్ కొట్టినట్లు వుండిపోయింది. ఆ వ్యక్తి కూడా కప్పు సాసర్‌తో అదే విధంగా వుండిపోయింది. కొంచెం సేపటికి తెప్పరిల్లి "కాఫీ తీసుకోండి" అందామె.

వసుంధరాదేవి కోపంగా ఆమె వంక చూసి "ఇది నా ఇల్లని తెలిసే ఈ ఇంట్లో పనిమనిషిగా అవతారం ఎత్తావా?" అడిగింది.

"ఇది మీ ఇల్లని నాకు తెలీదమ్మగారూ! నన్ను నమ్మండి! ఇది మీ యిల్లని తెలిస్తే మీ ఇంటి గడప కూడా తొక్కేదాన్ని కాదమ్మా. ఎవరింటికెళ్ళినా నా అందం చూసి నాకు ఎవ్వరూ పనివ్వలేదమ్మా! చివరికి పెద్దమ్మగారు అడిగిన వెంటనే పనిచ్చారు. పూటగడవటం కష్టమయ్యే నేనీ పనిలో చేరాను గానీ మరే దురుద్దేశం లేదమ్మా! నన్ను పనిలో నుండి తీసేయవద్దమ్మా! మీ కాళ్ళు పట్టుకుంటాను!" అంటూ కాళ్ళు పట్టుకుందామె.

వసుంధరాదేవి వదిలించుకుంది.

"నన్ను దయతలచండమ్మా!" అంటూ కన్నీరు మున్నీరుగా విలపించింది.

"పెద్దమ్మగారి మాటను ధిక్కరించే అధికారం ఈ యింట్లో ఎవ్వరికీ లేదు!" అంది వసుంధరాదేవి.

అంతలో కిందనుండి "పంకజం... పంకజం! ఎక్కడున్నావ్? పూజకు పూలు తీసుకు రమ్మన్నాను." అంటూ వినిపించడంతో గబగబా కిందకు పరుగెత్తింది ఆ అమ్మాయి.

వసుంధరాదేవికి రెండు నెలల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

ఫలానాచోట ప్రాస్టిట్యూషన్ జరుగుతోందని ఇన్ఫర్మేషన్ వచ్చింది. దాంతో ఎస్.ఐ. వసుంధరాదేవి కానిస్టేబుల్స్‌ను వెంట బెట్టుకుని అక్కడకు వెళ్ళింది. వచ్చిన ఇన్ఫర్మేషన్ కరెక్టే! కానిస్టేబుల్స్ అందర్నీ వ్యాన్ ఎక్కించారు. కానీ ఒకామె మాత్రం కానిస్టేబుల్స్ ఎంత ప్రయత్నించినా నేను ఎక్కనని మొరాయించింది. దాంతో వసుంధరాదేవి కల్పించుకోక తప్పలేదు.

"ఎక్కు! ముందు వ్యానెక్కు!" అంటూ చెయ్యిపట్టి గట్టిగా లాగింది. ఆమె మాత్రం "అమ్మా! మీ కాళ్ళు పట్టుకుంటాను! నన్ను వదిలేయండమ్మా! ఈ ఒక్కసారికి నన్ను క్షమించి వదిలేయండమ్మా!" అంటూ బ్రతిమలాడింది.

"అందర్నీ వ్యానెక్కించాం! నువ్వు కూడా వ్యానెక్కు! నువ్వేమైనా స్పెషలా? ఎక్కు!" అంటూ గదిమింది.

"అమ్మా! గత్యంతరం లేక నేనీ పనికి ఒప్పుకున్నానమ్మా! ఇంట్లో నా బిడ్డకు చాలా ప్రమాదంగా వుందమ్మా! వాడికి మందులు కొనడానికే నేనీ పాడు పని చేయడానికి సిద్ధపడ్డానమ్మా! నా పిల్లాడక్కడ చావుబతుకుల మధ్య వున్నాడమా! మీకు పుణ్యముంటుంది నన్ను వదిలేయండమ్మా!" అంటూ కాళ్ళు పట్టుకుందామె.

"కథలు బాగానే చెబుతున్నావే! నీలాంటోళ్ళు యిలాగే కథలల్లుతారు గానీ పద! పద! ఇది పాడు పని అని తెలిసి కూడా ఎందుకు చేశావ్? చేసినందుకు ఇదే శిక్ష పడుతుంది! నడు! అంటూ చెయ్యిపట్టుకుని లాగింది. ఆమె గదిలోనుండి బయటకు వచ్చింది.

"కానిస్టేబుల్స్!"

"ఎస్ మేడమ్!"

"ఆమెను వ్యాన్ ఎక్కించండి!" అంటూ ఆజ్ఞ జారీ చేసి వెళ్ళింది వసుంధరాదేవి.

కానిస్టేబుల్స్ ఆమెను ఈడ్చుకుని వచ్చి మరీ వ్యానెక్కించారు! సెల్‌లో బంధించేవరకు ఆమె అలా విలపిస్తూనే వుంది. అందరికీ జరిమానాలు విధించారు. ఆమె జరిమానా కట్టలేక జైలుశిక్షననుభవించింది.

"అప్పుడలా వేశ్యలా తారసపడినామె ఇప్పుడిలా తనింట్లో పనిమనిషిలా ప్రత్యక్షం కావడం..." వసుంధరాదేవికేమీ పాలుపోలేదు. తనింట్లో వుంటే ఇలా జరిగివుండేది కాదు. తను చెల్లెలు పెళ్ళికి ఊరెళ్ళడం, సరిగ్గా అదే సమయంలో ఆమె తనింటికి పనికోసం రావడం, తన అత్తగారు పనివ్వడం... అంతా జరిగిపోయింది. అత్తగారి మాటకు ఆ ఇంట్లో తిరుగులేదు. పనిమనుషుల్ని పెట్టడం, తీయడం అంతా ఆవిడ చేతుల్లోనే వుంటుంది. అత్తగారిని వసుంధరాదేవి ఎంతో గౌరవిస్తుంది. ఆమె మాటను ఎన్నడూ జవదాటదు. ఆమె అంటే వసుంధరాదేవికో ప్రత్యేకమైన అభిమానం!

ఆ ఇంట్లో వుండేది నల్గురే! వసుంధరాదేవి, ఆమె భర్త రాజశేఖరం, అత్తగారు మహేశ్వరీదేవి, కొడుకు మనోహర్! లేక లేక కల్గిన కుమారుడని, ఇక మరో కొడుకుగానీ, కూతురుగానీ పుట్టే అవకాశం లేదని మనోహర్‌నెంతో గారాబంగా చూస్తారు ఆ ఇంట్లో. మనోహర్ పుట్టినప్పుడు గర్భసంచీ తీసివేయవలసి రావడంతో మరోబిడ్డ పుట్టే అవకాశం లేదు వసుంధరాదేవికి! అందుకే ఆ బాబును నౌకర్లతో సహా అందరూ ఎంతో గారాబంగా చూస్తారు.

❋ ❋ ❋

స్టేషన్‌లో కూర్చుందన్న మాటేగానీ



## మనసు

**చిరుగాలి కదలికలకు**
**పరవశిస్తుంది**
**చిరుజల్లు తాకిడికే పులకరిస్తుంది**
**కడలి పొంగులవోలె**
**ఎగిసిపడుతుంది**
**జలపాతంలా సాగిపోతుంది**
**ప్రేమలోన కలిసి కరగిపోతుంది**
**అనురాగానికి కోవెల అవుతుంది**
**బంధాలకోసం తపిస్తుంది**
**అవి అనుబంధాలవ్వాలని**
**ఆశపడుతుంది**
**ఎన్నో ఎన్నో తలుస్తుంది**
**తలవనివెన్నో రుచి చూస్తుంది**
**ప్రతీదానికి స్పందిస్తుంది**
**ప్రతి స్పందనను కోరుకుంటుంది**
**అది ఎంతో సున్నితమైనది**
**కానీ చాలా కఠినమైనది**
**అది ఎంతో అందమైనది**
**కానీ చాలా లోతైనది**
**అది మాటరాని మూగది**
**కానీ మాటలకందని భావాల గని**
**మనిషిలోని అందమైన మనసది**
**మనిషిని మనిషిగా చేయు సొగసది.**

***- టి. అరుణ***

వసుంధరకు పనిమీద మనసు లగ్నం కాలేదు. పంకజం గురించే ఆలోచించడం మొదలు పెట్టింది.

❋ ❋ ❋

ఆ రోజు ఉదయాన్నే స్నానానికెళుతూ నాల్గు తులాల చంద్రహారం డ్రెసింగ్ టేబుల్ మీద కావాలని వదిలేసి బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది వసుంధర. ఆ సమయంలో గది శుభ్రం చేయడానికి పంకజం అక్కడకొస్తుందని ఆమెకు తెలుసు! కానీ స్నానం చేసి వచ్చేసరికి ఆ హారం అక్కడేవుంది. మౌనంగా ఆ హారాన్ని బీరువాలో వుంచేసింది వసుంధర.

❋ ❋ ❋

మరోసారి వెయ్యిరూపాయిలున్న పర్సును కావాలనే హాలులో పడేసింది. ఆ సమయంలో పంకజం తడిగుడ్డతో హాలు తుడవడానికి అక్కడ కొస్తుందని ఆమెకు తెలుసు. కానీ పంకజం ఆ పర్సును తీసుకెళ్ళి మహేశ్వరీదేవి కిచ్చింది. ఆమె కోడలిని పిలిచింది.

"వసుంధరా! ఈ పర్సు నీదేనా?" అడిగిందామె.

"అవునత్తయ్యా!" అంది వసుంధరాదేవి.

"హాలులో పడిపోయి వుందట! పంకజం తెచ్చింది. అన్నీ వున్నాయో లేవో ఒకసారి చూసుకో!" అంది అత్తగారు.

వసుంధర పర్సు తెరిచి చూసింది. అందులో తను మరిచిన వెయ్యిరూపాయిలు అలాగే వున్నాయి. అందులో అంతకంటే ఎక్కువ డబ్బులుండేవని అబద్ధం చెప్పలేక పోయింది. ఆమె చేస్తున్న ఎస్.ఐ. ఉద్యోగం ఆమెను అబద్ధం చెప్పనీయలేదు. అందుకే "అవునత్తయ్యా! వున్నాయి" అంది వసుంధర.

"పంకజం దొంగతనం చేసే మనిషి కాదని తెలుసు! కానీ ఇప్పుడది రుజువైంది." అంది మహేశ్వరీదేవి.

❋ ❋ ❋

ఇది జరిగిన ఓ పదిరోజుల తర్వాత ఒక రోజు ఆదివారం వసుంధరాదేవి హాలులో కూర్చుని వుంది. పార్కు కెళ్ళిన పంకజం, మనోహర్ ఇంకా తిరిగి రాలేదు. వాళ్ళ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అంతలో పంకజం రక్తంతో నిండిన మనోహర్‌ను రెండు చేతుల మీద ఎత్తుకొస్తూ కనిపించింది. అది చూసి కంగారుగా వసుంధర బయటకు పరుగెత్తింది.

"ఏమైంది? ఏం చేశావ్ వాణ్ణి? నిన్నే అడిగేది! ఈ దెబ్బలేంటి?" గబగబా అడుగుతూ మనోహర్‌ను ఆమె నుండి లాక్కుని సోఫాలో పరుండబెట్టింది.

పంకజం కంగారుగా "నేనేం చేయలేదమ్మా!" అంది. ఆమె మాటలేవీ విన్పించుకోక "అత్తయ్యా! అత్తయ్యా! ఏవండీ!.. ఇలా రండి!" అంది గట్టిగా.

రాజశేఖరం, మహేశ్వరీదేవికి ఏమైందో ననుకుంటూ కంగారుగా వచ్చారు. నౌకర్లు కూడా పరుగెత్తుకుని వచ్చారు.

"చూడండత్తయ్యా! బాబునేం చేసిందో ఏమో వాడి వంటినిండా దెబ్బలే! రక్తం ఎంత పోయిందో ఏమో?" ఏడుస్తూ అంది వసుంధర.

మహేశ్వరీదేవి గబగబా సోఫావద్దకు పరుగులాంటి నడకతో వచ్చి "అయ్యో! అయ్యో! ఈ దెబ్బలేంటి? బాబూ! రాజశేఖరం! డాక్టర్‌కు ఫోన్ చేయినాయనా!" అంది.

"ఈ పంకజమే ఏదో చేసివుంటుంది." కోపంగా అంది వసుంధర.

"లేదమ్మా! నేను అలాంటిదాన్ని కాదమ్మా! నన్ను నమ్మండి! పెద్దమ్మగారూ! మీరైనా నా మాట నమ్మండి! నేను, బాబు పార్కు నుండి వస్తుంటే బాబు కోతి బొమ్మ కొనమని మారాం చేశాడు. అవి రోడ్డు కవతలి వైపున్నాయి. నేను మెల్లగా రోడ్డు దాటిస్తుంటే బాబే నా చేయి వదిలి బొమ్మలవాడి వైపు పరుగెత్తాడు. అంతలో అట్నుండి ఆటో వచ్చింది. నేను బాబును కాపాడేలోపే అది బాబును ఢీకొందమ్మా!" ఏడుస్తూ అంది పంకజం.

"బాబును తీసుకెళ్ళేముందు ఎన్ని జాగ్రత్తలు చెప్పాలో అన్నీ చెప్పి పంపించాను. అయినా నీ కంత నిర్లక్ష్యం ఏమిటే? బాబును అక్కడే నిల్చోబెట్టి నువ్వు ఆ కోతిబొమ్మ కొనుక్కుని రాలేకపోయావా? నువ్వు కావాలనే బాబును పంపావ్! నిజం చెప్పు!" గట్టిగా గదిమింది వసుంధర.

## సింగిల్ పేజీ కథలకు ఆహ్వానం

**'ప్రియదత్త'** సకుటుంబ సచిత్ర వార పత్రికలో సింగిల్ పేజీ కథలు ప్రచురణార్థం రచయిత(త్రు)లకు ఆహ్వానం పలుకుతున్నాం. సింగిల్ పేజీ కథలు పంపేవారు ఈ క్రింది సూచనలు గమనించ కోరతాము.


★ కథ అర ఠావు సైజులో 3 పేజీలు మించరాదు.

★ పేజీకి ఒక వైపు మాత్రమే రాయాలి.

★ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

★ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

★ కథలను త్రిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. – ఎడిటర్



"నాకటువంటి ఆలోచనే లేదమ్మగారూ! బాబును కాపాడదామనుకున్నాను. కానీ అప్ప టికే బాబును పట్టుకుని లాగాను. ఇద్దరం కలిసి రోడ్డు మీద పడ్డాం! నా మాట అబద్ధమైతే నాకు తగిలిన దెబ్బలు చూడండమ్మా!" అంటూ చూపించింది. ఆమె అరచెయ్యి, చేయి అంతా గీసుకుపోయి బాగా రక్తం వస్తోంది పంక జానికి.

వసుంధర ఆమె మాటలు విన్పించుకునే స్థితిలో లేదు. ఆ రోజు పంకజం తన బాబు ప్రాణాపాయస్థితిలో వున్నా విడిచి పెట్టలేదనే కక్ష మనసులో పెట్టుకుని ఈ పని చేసి వుంటుందని నమ్మింది వసుంధర.

అంతలో డాక్టర్ వచ్చి బాబును పరీక్ష చేసి వెంటనే అంబులెన్స్ పంపమని హాస్పిటల్‌కు ఫోన్ చేశాడు. అయిదు నిమిషాల అనంతరం అంబులెన్స్ వచ్చింది. బాబును అందులో ఎక్కించారు. అంబులెన్స్ హాస్పిటల్ వైపు దూసుకుని పోయింది.

* * *

హాస్పిటల్‌లో బాబును బెడ్ మీద పరుండబెట్టారు. హెడ్ వచ్చి టెస్ట్ చేసి "చేతికి బాగా దెబ్బ తగిలింది. తలకు కూడా గాయమైంది. ఇప్పటికే చాలా రక్తం పోయింది. రక్తం కావాలి!" అంటూ బాబు రక్తం టెస్ట్‌కు పంపారు. రాజశేఖరం, మహేశ్వరీ దేవి, వసుంధరాదేవి బెడ్ చుట్టూ కూర్చుని వున్నారు.

అంతలో డాక్టర్ వచ్చి "బాబుది 'ఓ' నెగటివ్ గ్రూప్ రక్తం అది ఇక్కడి బ్లడ్ బ్యాంక్‌లో స్టాక్ లేదు." అన్నాడు.

"సార్! మా బ్లడ్ గ్రూప్‌లు టెస్టు చేయండి సార్!" అన్నారు ముగ్గురూ ఒకేసారి.

ముగ్గురి రక్తం టెస్ట్ చేసారు. వసుంధరా దేవికి ఆ గ్రూప్ రక్తం వున్నప్పటికీ ఆమెకున్న బి.పి వల్ల రక్తం తీయనని చెప్పాడు డాక్టర్.

"బాబుకు రక్తం చాలా పోయింది. ఈ గ్రూప్ రక్తం అర్జంటుగా కావాలి! లేక పోతే....!"

"లేకపోతే...?" ముగ్గురూ ఒకేసారి అన్నారు.

మారుమాట్లాడక తలవంచుకుని వెళ్ళి పోయాడు డాక్టర్. ఏం చేయాలో తోచలేదు ముగ్గురికీ!

టి.వి.లో అనౌన్స్ చేయించారు. ప్రొఫెషనల్ డోనర్స్ దొరుకుతారేమోనని వెదక డానికి వెళ్ళారు. వేరే బ్లడ్ బ్యాంక్ వాళ్ళు ఆ గ్రూప్ రక్తం యిస్తామన్నారు. కానీ దానికి బదులుగా వేరే గ్రూప్ రక్తం ఇవ్వమని, బ్లడ్ రీప్లేస్‌మెంట్ లేకుండా బ్లడ్ యివ్వమని చెప్పారు. రాజశేఖరం తాను యిస్తానన్నాడు. కానీ అతనికి షుగర్ వుండడంతో తీసుకోడానికి నిరాకరించారు. ఊరంతా గాలించినా ఎక్కడా ప్రొఫెషనల్ డోనార్స్ దొరకలేదు.

* * *

ఇక్కడిలా వుంటే అక్కడ వసుంధర యింట్లో నౌకర్లంతా పంకజాన్ని నానా మాటలు అన్నారు.

"నీవల్లనే బాబుకీ ప్రమాదం జరిగింది" అంది వంటామె.

"ఇన్నాళ్ళు సుఖంగా వున్న కాపురంలో చిచ్చుపెట్టావు నువ్వు!" అన్నాడు తోటమాలి.

"ఆ బాబే ఈ ఇంటికి దీపం! ఆ బాబే లేక పోతే పెద్దమ్మగారు, అయ్యగారు, చిన్నమ్మ గారు బతకరింక!" అన్నాడు వాచ్‌మేన్.

"అవును! ఆయమ్మకు పిల్లలు పుట్టే యోగం కూడా లేదు." అంది చాకలి.

"ఈ పాపిష్టిదాని వల్లే ఇదంతా జరిగింది" అంది పనిమనిషి.

పంకజం ఏడుస్తూ ఓ మూల కూలబడి పోయింది.


* * *

రాజశేఖరం, వసుంధరాదేవి ఎక్కడ ప్రయ త్నించినా బ్లడ్ దొరకలేదు. ఇంక పిల్లాడిపై ఆశలు వదులుకున్నారా దంపతులు. ఇద్దరూ కలిసి టాక్సీ ఎక్కారు. వసుంధరాదేవి ఏక ధాటిగా విలపించసాగింది.

"ఊరుకో వాసూ! మనకింతే ప్రాప్తం అను కుందాం!" అన్నాడు రాజశేఖరం!

"చేజేతులా చేసుకున్నదాన్ని ప్రాప్తం అనకండి! అసలిదంతా జరగడానిక్కారణం ఆ రాక్షసండి!" అంది కోపంగా వసుంధర.

"వసూ! చదువుకుని కూడా నువ్విలా మాట్లాడ్డం ఏమన్నా బాగుందా? ఏక్సిడెంట్ జరిగింది మన బాబు తప్పు వలన! పాపం ఆ పంకజానిక్కూడా దెబ్బలు తగిలాయి కదా! ఆ అమ్మాయి తప్పేముంది చెప్పు! భగవంతుడి మీద భారం వేయడం తప్పితే మనం చేయగలగిందేమీ లేదు!" అన్నాడు.



## సైఫ్‌తో ఇటాలియన్ గర్ల్ చెట్టపట్టాల్!

అమృతాసింగ్‌కి బదులు ఈ మధ్య సైఫ్ అలీఖాన్‌తో పాటు ఇటాలియన్ గర్ల్ తిరుగు తోంది. ముంబాయిలోని ఓ ఫ్లాట్‌లో ఉంటున్న ఈ చిన్నదాని ఇంటికి సైఫ్ రాకపోకలు నిత్యం జరుగుతున్నాయట. "ఈ విషయం అమృతా సింగ్‌కి తెలిసినా ఏమీ చెప్పలేని పరిస్థితామె దని" సైఫ్ బంధువొకరు చెప్పారు. అయితే సైఫ్ తల్లిదండ్రులు మాత్రం కోడలి పక్షమేనట!

"ఏమోనండీ! మన బాబు మనకు దక్కుతాడన్న నమ్మకం నాకు లేదండీ!" అంది ఏడుస్తూ వసుంధరాదేవి.

అంతలో హాస్పిటల్ రావడంతో ఇద్దరూ దిగారు. ఏ చెడు వార్త వినవలసి వస్తుందోనని హాస్పిటల్ లోపలికి రానని అక్కడున్న సిమెంటు గట్టుమీదే కూర్చుండిపోయింది వసుంధర. రాజశేఖరం ఆమెను పొదివి పట్టుకుని లోనికి తీసుకెళ్ళాడు. బాబున్న గదివైపు భయం భయంగా వెళ్తున్న వాళ్ళకు "కంగ్రాచ్యులేషన్స్ రాజశేఖరంగారూ!" అన్న డాక్టర్ మాటలకు ఇటు తిరిగారు.

డాక్టర్ బాబు గదినుండి బయటకు వస్తున్నాడు.

"ఏమిటి డాక్టర్ మీరనేది?" అన్నారిద్దరూ ఏక కంఠంతో.

"మీ బాబుకిప్పుడే ప్రమాదం లేదు." అన్నాడు డాక్టర్ ఆనందంగా.

"నిజం!" అంటూ ఇద్దరూ గదిలోకి పరుగులాంటి నడకతో వెళ్లారు. బాబును సజీవంగా చూసి ఎంతో సంతోషించారు.

"మిస్టర్ రాజశేఖరం! ఈ మందులు తీసుకురండి! అలాగే మీ అమ్మగారిని యింటి దగ్గర వదిలి రండి! ఆవిడ పాపం ఇక్కడే వుండిపోయారు!" అన్నాడు డాక్టర్.

"అలాగే డాక్టర్!" అంటూ డాక్టర్ ఇచ్చిన మందుల చీటీ తీసుకుని మహేశ్వరీ దేవిని తీసుకుని బయలుదేరాడు రాజశేఖరం.

వాళ్ళు వెళ్ళిపోయాక "డాక్టర్! మా బాబును రక్షించి మాకెంతో మేలు చేశారు. మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేం డాక్టర్!" అంది ఆనందంగా వసుంధరాదేవి.

"ఇందులో నేను చేసిందేమీ లేదమ్మా! నిజానికి మీ బాబును రక్షించింది నేను కాదమ్మా!"

"మరి?" ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"ప్రక్కరూంలో వున్నామె!" అంటూ ప్రక్కరూమ్‌కు తీసుకుని వెళ్ళాడు డాక్టర్.

అక్కడ నీరసంగా పడుకుని వున్నామెను చూసి ఒక్కసారిగా షాక్ కొట్టినట్లు నిలబడి పోయింది వసుంధరాదేవి.

"ఈమె..." సందిగ్ధంగా అడిగింది.

"అవును! ఈవిడే! మీ బాబుకు రక్తదానం చేసింది. మీరెళ్ళిపోయిన తర్వాత యిక్కడకు వచ్చింది. తన రక్తం టెస్ట్ చేయమంది. లక్కీగా ఆమె రక్తం బాబు రక్తం ఒకటే గ్రూప్! కానీ అన్ని బాటిల్స్ రక్తం ఒక్కావిడ దగ్గర్నుండి తీయడానికి నేను నిరాకరించాను. తన వంట్లోని రక్తమంతా తీసైనా సరే బాబును రక్షించమని కాళ్లావేళ్లాపడి బతిమలాడింది. నేను ఒప్పుకోక తప్పలేదు. బాబుకు జన్మనిచ్చింది మీరైనా పునర్జన్మనిచ్చింది మాత్రం ఆవిడే!" అన్నాడు డాక్టర్.

అంతలో నర్స్ వచ్చి "డాక్టర్ ఆపరేషన్‌కు టైమైంది! పేషెంటును థియేటర్‌లో తీసుకెళ్ళాం!" అని చెప్పడంతో "ఎక్స్‌క్యూజ్ మి!" అంటూ వెళ్ళిపోయాడు డాక్టర్.

వసుంధర కళ్ళకిప్పుడామె ఓ వేశ్యలా కన్పించడం లేదు. తనకందనంత ఎత్తుకెదిగిన దేవతలా కనిపిస్తోంది. వసుంధరకు తనమీద తనకే అసహ్యం వేసింది. తను ఇన్నాళ్ళు ఆమెలో వున్న మనిషినే చూసింది కానీ మనసును చూడలేకపోయింది. తాను చదువుకుని ఐ.పి.యస్ పాసై, ఉన్నతోద్యోగం చేస్తూ ఎంత నీచంగా ప్రవర్తించింది. ఆమెనో వేశ్యగానే చూసిందిన్నాళ్ళు. ఏదో ఒక దొంగతనం బనాయించి ఆమెను యింట్లో నుండి వెళ్ళగొట్టాలని చూసింది. చివరకు అనరాని మాటలంది. కానీ ఆమె.... ఆమె.... అవేవీ పట్టించుకోకుండా తన ఏకైక కొడుకుని రక్షించింది. ఆమె బిడ్డ చావుబతుకుల మధ్య వున్నా తను "డ్యూటీ యీజ్ ఫస్ట్" అంటూ కనీస కనికరమైనా చూపలేదు. కానీ తన బాబు ప్రాణానికి ఆమె ప్రాణాన్ని అడ్డుగా వేసింది. ఆమె నిజంగా దేవత..." యిలా ఆలోచిస్తున్న వసుంధరకు "అమ్మా!" అన్న పిలుపుకు ఈ లోకంలో కొచ్చింది వసుంధర.

"అమ్మా! నన్ను క్షమించండమ్మా! మీ అనుమతి లేకుండా మీ బాబుకు రక్తం యిచ్చాను!" అంటూ కంగారుగా లేవబోయింది.

"ఆ...ఆ...నువ్వు పడుకో పంకజం!" అంది వసుంధర.

"అమ్మా!" ఆశ్చర్యంగా అంది పంకజం.

"పంకజం నేను నిన్నో వేశ్యగానే చూసానిన్నాళ్ళు! అనరాని మాటలన్నాను. కానీ నువ్వు... నాకు ... నాకు చాలా సాయం చేశావ్! థ్యాంక్యూ... థ్యాంక్యూ వెరీమచ్..." అంది వసుంధర.

"అమ్మా! మీ స్థానంలో ఎవరున్నా అలాగే ప్రవర్తించేవారమ్మా! ఇందులో నేను చేసిన సహాయమేమీ లేదమ్మా! బిడ్డపోతే తల్లిపడే బాధ, ఆవేదన నాకు తెలుసు కనుకనే నేనీ పని చేశానమ్మా!"

"పంకజం... అంటే నీ బిడ్డ..." ఆ రోజు సంఘటన గుర్తుకు తెచ్చుకుంటూ అడిగింది వసుంధర.

"అవునమ్మా! అప్పుడు నాకు మూడ్రోజులుగా కూలిపని లేక బిడ్డ మందుల కోసం ఆ పాడుపని చేయడానికి సిద్ధపడ్డానమ్మా! కానీ నా దురదృష్టం చూడండమ్మా! ఆ రోజే మీరు నన్ను పట్టుకున్నారు. మందుల్లేక నా బిడ్డ ఏడిచి ఏడిచి చివరికి ఈ లోకం వదిలి వెళ్ళిపోయాడమ్మా! నే వెళ్ళేసరికి మునిసిపాలిటీ వాళ్ళు నా బాబు శవాన్ని తీసుకెళ్ళి పోయారని ఇరుగుపొరుగు చెప్పారమ్మా!"

ఆ మాట వింటూనే దిగ్భ్రాంతి చెందింది వసుంధర.

"అంటే నీ బాబు ఆ రోజే చచ్చిపోయాడా?" అడిగింది వసుంధర.

"అవునమ్మా!"

ఒక్కసారిగా ఎవరో గుండెను నొక్కి పట్టినట్లు అనిపించింది వసుంధరకు. తను ఒక బాబును హత్యచేసినట్లు ఎంతో బాధ పడింది. తను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశం లేనందుకు ఎంతో చింతించింది. ఆమె కళ్ళ ముందున్న తెరలన్నీ తొలగిపోయాయి.

"పంకజం! నన్ను క్షమించు... నేను... నేను... నీకు చాలా చాలా అన్యాయం చేశాను. చాలా అపకారం చేశాను. కానీ నువ్వు... నువ్వు... " ఆమె మాటలను ఏడుపు మింగేసింది. ఆమె కళ్ళకిప్పుడు పంకజం ఎంతో ఉన్నతంగా కన్పిస్తోంది. తన కందనంత ఎత్తుకెదిగినట్లు కన్పిస్తోంది. ❋

